
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
గురువారం 27 జూన్ 2024



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్ రూరల్, జూన్ 26: కొడంగల్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ నవీన్‌కుమార్ బుధవారం పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పర్సాపూర్, గుండ్లకుంట, పాత కొడంగల్, బుల్కాపూర్, చిట్లపల్లి, ఐనన్‌పల్లి, ఖాజఅహ్మద్ పల్లి, ఉడిమేశ్వరం గ్రామాలతో పాటు కొడంగల్ పట్టణంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గానికి మహర్దశ పట్టనుంది. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజవర్గం కావడంలో రూపురేఖలు మారనున్నాయి. ఈ నియోజకవర్గం త్వరలోనే విద్యాహబ్‌గా మారనుంది. రాష్ట్రంలోనే సమీకృత గురుకులాల ఏర్పాటుకు ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టనున్నారు. పైలెట్ ప్రాజెక్టుగా సమీకృత గురుకులం నిర్మాణానికి అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఇందుకు సంబంధించి నిధుల మంజూరుతో పాటు పరిపాలన అనుమతులు ఇచ్చారు.

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అన్నీ గురుకులాలు ఒకే దగ్గర ఉండేలా 20 ఎకరాల్లో నిర్మాణం
- మెడికల్ కళాశాల ఏర్పాటుకు మార్గం సుగమం
- రైతులతో అధికారుల చర్చలు సఫలం
- భూముల పరిశీలన.. హద్దుల ఏర్పాటు
- సీఎం ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం



పాత కొడంగల్‌లో సమీకృత గురుకులాలకు కేటాయించిన భూమి

కొడంగల్‌కు మహర్దశ

పైలెట్ ప్రాజెక్టుగా సమీకృత గురుకులాలకు శ్రీకారం

కొడంగల్, జూన్ 26: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమీకృత గురుకులాల ఏర్పాటుకు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు కింద 20 ఎకరాల్లో రూ.22 కోట్లతో నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. అరకొర వసతులు, అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న గురుకులాల పాఠశాలలు ఉండగా ప్రభుత్వం సమీకృత గురుకులాలు (ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్) విధానాన్ని తీసుకొచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలన్నింటిని ఒకే దగ్గర ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా కొడంగల్ శివారులోని పాత కొడంగల్‌లో సమీకృత గురుకులాల ఏర్పాటు కోసం భూమిని కేటాయించారు. ఇప్పటికే భూ కేటాయింపు పూర్తి కాగా గురుకులాల నిర్మాణానికి సైతం నిధులు కేటాయించారు. రాష్ట్రంలోనే కొడంగల్‌లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించనున్న గురుకులాల ఏర్పాటు కోసం అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఇందుకు ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి సమీకృత గురుకులాల నమూనాను పరిశీలించి గురుకులాలతో పాటు మరి కొన్ని అభివృద్ధి పనులకు రూ.73.43 కోట్లు నిధులు మంజూరు చేశారు. త్వరలోనే టెండర్ల పూర్తితో పనులను ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఇప్పటికే జిల్లా కలెక్టర్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, స్థానిక నాయకులు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి తదితరులు స్థలాన్ని పరిశీలించారు.

విద్యాహబ్‌గా మారనున్న కొడంగల్

సీఎం సొంత నియోజకవర్గం త్వరలోనే విద్యాహబ్‌గా మారనుంది. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో ప్రణాళికలు సిద్ధం చేయగా త్వరలోనే పనులను ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇటీవల కలెక్టర్ పాత కొడంగల్‌లో సమీకృత గురుకులాల ఏర్పాటు కోసం పరిశీలించారు. నిధుల మంజూరుతో టెండర్లు పూర్తి కాగానే పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సమీకృత గురుకులాల ఏర్పాటుతో మేలు

కార్పొరేట్ తరహాలో భవనాలను నిర్మించి సమీకృత గురుకులాల ఏర్పాటు కోసం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గురుకులాలను పైలెట్ ప్రాజెక్టు కింద సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. భవన నిర్మాణంలో జీ ప్లస్ త్రీ అంతస్తులో తరగతి గదులు, మరో భవనంలో కల్చరల్ సెంటర్, జీ ప్లస్ 8 అంతస్తులో హస్టల్, మెస్, క్రీడా మైదానం ఏర్పాటుతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలిగేలా భవన సముదాయాలను నిర్మించనున్నారు. ప్రస్తుతం కొడంగల్‌కు మంజూరైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు స్థానికంగా భవనాలు లేకపోవడంతో కారణంగా ఇతరాత్ర ప్రాంతాల్లోని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పాత కొడంగల్ శివారులో ఇప్పటికే నిర్మాణం చేపట్టిన ఎస్టీ గురుకుల పాఠశాలతో పాటు సమీకృత గురుకులాల కోసం కేటాయించారు.

రూ.73.45 కోట్లు మంజూరు

ప్రస్తుతం కొడంగల్‌లో కొనసాగుతున్న బీసీ గురుకుల పాఠశాలలు మొయినాబాద్ సమీపంలోని కనకమామిడి దగ్గర 280 మందితో కొనసాగుతుంది. షాద్‌నగర్, చేవేళ్ల తదితర ప్రాంతాల్లో మరో రెండు పాఠశాలలు, మైనారిటీ గురుకుల పాఠశాల సైతం ఇతర ప్రాంతంలో అద్దె భవనంలో కొనసాగుతోంది. విద్యార్థులకు ఇబ్బందులను పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి అన్నీ ఒకే దగ్గర ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇందుకు గురుకుల పాఠశాలతో పాటు కళాశాలలు, ఇతరాత్ర వాటి నిర్మాణం కోసం రూ.73.45 కోట్లు మంజూరుతో పరిపాలన అనుమతులను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో త్వరలోనే పనుల ప్రారంభం కానున్నాయి.

మెడికల్ కళాశాల ఏర్పాటుకు ..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన మెడికల్ కళాశాల ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. కొడంగల్ శివారులోని అప్పాయిపల్లి (ఎరన్‌పల్లి)లో మెడికల్ కళాశాలను మంజూర్ చేసింది. కళాశాల ఏర్పాటు కోసం అధికారులు చేపట్టిన భూ సేకరణలో పలువురు రైతులు ససేమిర అనడం, అందులో కొంత మంది రైతులు చివరికి అధికారుల చర్చలతో అంగీకరించారు. అప్పాయిపల్లి శివారులోని సర్వే నెం.19లో గల భూములను అధికారులు పరిశీలించారు. భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న రైతులతో మాట్లాడి సర్వే ఆధారంగా హద్దులను ఏర్పాటు చేస్తున్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటుకు భూములు ఇచ్చే రైతులు వారి పొలాల హద్దులను అధికారులకు చూపించారు. అధికార యంత్రాంగం కళాశాల భవన నిర్మాణం, మౌలిక వసతుల సదుపాయాల కోసం రూ.124.50 కోట్లు మంజూర్ చేశారు. ప్రభుత్వం నర్సింగ్ కళాశాల భవన నిర్మాణం, సదుపాయాల కోసం సైతం మరో రూ.46 కోట్లు మంజూర్ చేశారు. దీంతో పాటు ప్రభుత్వం ఫిజియోథెరపీ, పారామెడికల్ కళాశాలను మంజూర్ చేసింది. నిర్మాణం కోసం రూ.27 కోట్లు మంజూర్ చేయగా భూములను రెవెన్యూ అధికారులు గుర్తించారు. భూములు స్వాధీనపర్చుకునే క్రమంలో రైతులకు పరిహారంతో పాటు ఉద్యోగాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.



అప్పాయిపల్లి శివారులో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

63 ఎకరాల్లో కళాశాల

కొడంగల్- తాండూరుమధ్యలో ఏర్పాటుకు అనుకూలంగా ఉండటంతో సర్వే నెం.19లో మెడికల్ కళాశాల నిర్మాణానికి నిర్ణయించారు. దీంతో అసైన్డ్ పట్టాలు పొందిన 63 ఎకరాలకు సంబంధించి 45 మంది రైతులకు పరిహారంతో పాటు ఉద్యోగాలను కల్పించేందుకు నిర్ణయించారు. దీంతో అభివృద్ధికి సహకరించాలనే ఉద్దేశంతో 23 మంది రైతులు ఇప్పటికే 33 ఎకరాల భూమిని అధికారులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని అప్పాయిపల్లి రైతులతో మాట్లాడి సర్వే నిర్వహించి హద్దులను ఏర్పాటు చేశారు. బుధవారం మిగతా రైతులతో తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో శ్రీనివాస్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు సంబంధిత రైతులతో భూ సేకరణ విషయంపై చర్చించారు. భూ సేకరణతో ప్రతీ ఎకరాకు రూ.10 లక్షలు, ఉద్యోగాన్ని కల్పిస్తామని అధికారులు సంబంధిత రైతులతో వివరించడంతో సానుకూలంగా స్పందించినట్లు అధికారులు తెలిపారు. సర్వే నెం.19లో చేపట్టనున్న మెడికల్ కళాశాల నిర్మాణం కోసం భూసేకరణలో అధికారులు తమకు ఉద్యోగంతో పాటు ఎకరాకు రూ.10 లక్షలు, 200 గజాల ఇంటి స్థలంతో ఇంటి నిర్మాణం చేపట్టాలని పలువురు రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

అభివృద్ధికి సహకరించాలి



కొడంగల్ ప్రాంతంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు రైతులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలి. కొడంగల్ మండలం అప్పాయిపల్లి శివారులో గల సర్వే నెం.19లో భూ నిర్వాసిత రైతులకు తగిన న్యాయం జరుగుతుంది. భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడం శుభ పరిణామంగా భావిస్తున్నాం.

- కె.వెంకట్‌రెడ్డి, కడా ప్రత్యేకాధికారి

సమీకృత గురుకులాలతో విద్యార్థులకు మేలు



కొడంగల్‌లో చేపట్టే సమీకృత గురుకులాలు ఏర్పాటు చేయనుండటంతో విద్యార్థులకు మేలు జరగనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు ఒకే దగ్గర కార్పొరేట్ స్థాయిలో విద్యను అభ్యసించేందుకు అవకాశం ఉంటుంది. అభివృద్ధికి అందరూ సహకరిస్తూ పనులను వేగవంతంగా జరిగేలా కృషి చేయాలి.

తిరుపతిరెడ్డి,
కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి

మెడికల్ కళాశాలను స్వాగతిస్తున్నాం



అభివృద్ధిలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి అప్పాయిపల్లి శివారులో మంజూరు చేసిన మెడికల్ కళాశాలను స్వాగతిస్తున్నాం. గతంలో సర్వే నెం.19లో అసైన్డ్ కింద ఇచ్చిన రెండు ఎకరాల భూమిని మెడికల్ కళాశాల ఏర్పాటులో భాగంగా అప్పగించాను. వెనకబడిన కొడంగల్ ప్రాంతం అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లడం హర్షణీయం.

- బాల్‌రాజ్, రైతు, అప్పాయిపల్లి

అందరూ సహకరించాలి



గ్రామ శివారులో నిర్మాణం చేపట్టే మెడికల్ కళాశాల నిర్మాణానికి భూమి ఇచ్చేందుకు రైతులు సహకరించాలి. గతంలో నాకు అసైన్డ్ కింద కేటాయించిన ఎకరాకు పైగా భూమిని కళాశాల ఏర్పాటులో భాగంగా అధికారులకు అప్పగించాను. ఎకరాకు రూ.10లక్షల చొప్పున, కుటుంబంలో ఉద్యోగం కల్పిస్తామని అధికారులు చెప్పడం సంతోషం.

- బస్వరాజ్, రైతు



కొడంగల్ తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో చర్చిస్తున్న అధికారులు




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

రక్తహీనతను సమూలంగా తగ్గించాలి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జూన్ 26: జిల్లాలో రక్తహీనతను సమూలంగా తగ్గించేందుకు ప్రతీ ఒక్కరికి ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్‌ను వేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ చాంబర్ నందు జిల్లా ఆరోగ్య, విద్యా, సంక్షేమ శాఖఅధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడారు. జిల్లాలో 75 శాతం మంది పిల్లలు రక్త హీనతతో బాధపడుతున్నారని, జిల్లా లో 1062 స్కూల్స్‌లో11-19 ఏళ్ల పిల్లలందిరికీ అన్ని శాఖల సమన్వయంతో ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్స్ ప్రతి గురువారము వేయాలన్నారు. ప్రతి స్కూల్‌లో రిజిస్టర్‌లో పేర్లు రాసి ఉదయం బ్రేక్ ఫాస్ట్ అయిన తర్వాత ఈ ట్యాబ్ లెట్స్‌ను వేయాలని, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రతి స్కూల్‌కు వెళ్లి ట్యాబ్‌లెట్స్‌ను వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాల్వాన్ కుమార్. జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకా దేవి, ఎస్సీ వెల్ఫేర్ మల్లేశం, డీవైఎస్ఓ హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో తరగతులను బహిష్కరించి విద్యార్థులతో ఏబీవీపీ నాయకులు

విద్యాసంస్థల బంద్ విజయవంతం

ఘట్‌కేసర్/పూడూరు/పరిగి, జూన్26: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో విజయవంతమైంది, బంద్ పిలుపుతో ప్రైవేటు పాఠశాలలకు యాజమాన్యాలు ముందుగానే సెలవు ప్రకటించారు. తెరిచిన ప్రభుత్వ పాఠశాలలను ఏబీవీపీ విద్యార్థి నాయకులు మూయించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్యామ్‌కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీ జరుగుతున్నదని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు చేపట్టకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పూడూరు మండలం చెన్‌గోముల్‌లో ఏబీవీపీ నాయకులు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బంద్ నోటీసును అందజేశారు. విద్యావ్యవస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు ఆరోపించారు. పరిగితోపాటు, గ్రామాల్లో ప్రభుత్వ/ప్రైవేట్ పాఠశాలలను బంద్ చేయించారు. పరిగిలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు.

తెలంగాణకు తలమానికంగా

జడ్పీ భవనాన్ని తీర్చుదిద్దుతాం

- స్పీకర్ ప్రసాద్‌కుమార్
- జడ్పీ భవన ప్రారంభోత్సవలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం
- ఇరువురిని సముదాయించిన స్పీకర్



జడ్పీ కొత్త భవనం ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, సునీతారెడ్డి

వికారాబాద్, జూన్26 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ భవనాన్ని అన్ని హంగులతో తెలంగాణ రాష్ట్రంలోనే తలమానికంగా తీర్చిదిద్దుతామని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. కలెక్టరేట్ సమీపంలో రూ.5 కోట్లతో నిర్మించిన జిల్లా ప్రజా పరిషత్ కొత్త భవనాన్ని ఆయన బుధవారం జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మహేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్య, మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల, జడ్పీ సీఈవో సుధీర్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోనే మంచి ఎలివేషన్ ఉన్న జడ్పీ భవనం వికారాబాద్‌దే కావడం విశేషమన్నారు. గత ప్రభుత్వం జడ్పీ భవన నిర్మాణానికి రూ.10 కోట్లు ఇస్తామని చెప్పి కాగితం ఇచ్చారే తప్పా, నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. సీఎంతో చర్చించి అసంపూర్తిగా ఉన్న జడ్పీ భవనాన్ని ఆరు నెలల్లో పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు తీసుకు వస్తానని హామీ ఇచ్చారు. సీఎం సహకారంతో సునీతారెడ్డికి ఉన్నత స్థాయి హోదా దక్కే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. ఫ్రెండ్లీ పోలీస్ అనేది పాటకే సరిపోతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ పరంగా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి మాట్లాడుతూ, జడ్పీ భవనం పూర్తికి మహిళా శిశు సంక్షేమం నిధుల్లో నుంచి రూ.3 కోట్లు విడుదల చేసే విధంగా కలెక్టర్ చొరవ చూపాలన్నారు. జడ్పీటీసీలు చేసిన పనులకు సంబంధించి రూ.5, 6 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉందని, కలెక్టర్ చొరవ తీసుకుని ఆ బిల్లులు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 14 మంది ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు పత్రాలు జారీ చేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, కొత్త జిల్లాల్లో జడ్పీ భవన నిర్మాణం జరిగింది రాష్ట్రంలో వికారాబాద్‌లోనేనన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, వికారాబాద్ జిల్లా కావాలనే 50 ఏళ్ల ఆకాంక్షను సాకారం చేసింది కేసీఆరేనన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యలు పరిష్కరించడానికి జడ్పీ వేదికన్నారు. అంతకు ముందు జడ్పీ చైర్‌పర్సన్, సీఈవో ఛాంబర్లను స్పీకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, జడ్పీటీసీలు సంతోష, ధారాసింగ్, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీలు అనసూయ, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జడ్పీటీసీలు, ఎంపీపీలు దూరం

ఇదిలా ఉంటే, జడ్పీ కార్యాలయం నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్‌తో బీఆర్ఎస్‌కు చెందిన జడ్పీటీసీలు, ఎంపీపీలు దూరంగా ఉన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డిపై అవిశ్వాసం ప్రకటిస్తూ బీఆర్ఎస్ జడ్పీటీసీలు నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. జడ్పీ చైర్‌పర్సన్ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ జడ్పీటీసీలు, ఎంపీపీలు జడ్పీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నామని జడ్పీవైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్ ఆంధ్రజ్యోతితో చెప్పారు. కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీలు మాత్రమే హాజరయ్యారు.



ఎమ్మెల్సీ ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం, వారిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ఆ కాగితంలో ఏముందో చెప్పలేదు : ఎమ్మెల్యే కాలె యాదయ్య

స్పీకర్ ప్రసంగం అనంతరం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మైక్ తీసుకుని... గత ప్రభుత్వం కాగితం మాత్రమే ఇచ్చిందని అంటున్నారు. వచ్చిన కాగితం గురించి, ఆ కాగితంలో ఏముందనేది మాకందరికి చెప్పి ఉంటే మాతో అయినంత వరకు మేమూ తిప్పలు పడేవాళ్లమన్నారు. కాగితం ఏందో మీరే రాసుకున్నారు. మీరే కాంట్రాక్టు చేసుకున్నారంటూ యాదయ్య వ్యాఖ్యానించడంతో వేదికపై ఉన్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి జోక్యం చేసుకుని.. ఏమి రాసింద్రు.. ఎవరు రాసింద్రు.. ఏమో రాసింద్రు... ఏం రాసిన... నీ ఇంటిదా.. నా ఇంటిదా అంటూ యాదయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ మాట్లాడిన తర్వాత నీవు మాట్లాడొద్దంటూ మహేందర్‌రెడ్డి యాదయ్యను నిలువరించే ప్రయత్నం చేయగా, నా పేరు తీసుకున్నందుకు మాట్లాడుతున్నా.. స్పీకర్ అనుమతి తీసుకునే మాట్లాడుతున్నానంటూ అంటూ యాదయ్య సమాధానమిచ్చారు. మహేందర్‌రెడ్డి, యాదయ్యల మధ్య మాటామాటా పెరగడంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ జోక్యం చేసుకుని నేను రాష్ట్ర ప్రభుత్వం తరపున బాధ్యత తీసుకుని పూర్తి చేసేలా కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం అందరూ కలిసి జడ్పీ భవనంలోకి వెళ్లగా కాలే యాదయ్య మాత్రం అక్కడి నుంచి తన వాహనంలో వెళ్లిపోయారు.

పారిశుధ్య కార్మికులకు రూ.21వేల వేతనం చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్
- మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

మేడ్చల్, జూన్ 26,(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు ఏపీ ప్రభుత్వం చెల్లిస్తున్నట్లుగా రూ. 21వేల వేతనం తెలంగాణ రాష్ట్రంలో కూడా కార్మికులకు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ మున్సిపల్ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌పే తదితర పద్ధతుల్లో ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారన్నారు. పట్టణాల్లో, నగరాల్లో ప్రజల ఆరోగ్యం పట్ల నిరంతరం శ్రమిస్తున్నా మున్సిపల్ సిబ్బంది అడుగడుగునా వివక్షతకు గురౌతున్నారని వాపోయారు. ఆర్థికశాఖ విడుదల చేసిన ఆర్డర్ల ప్రకారం వివిధ కేటగిరీలకు వేతనాలు అమలు చేయకుండా జీవోఎంఎస్ 4 ప్రకారం అందరికీ ఒకే వేతనాన్ని వర్తింపజేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీనితో మున్సిపాల్టీలలో పనిచేస్తున్న పబ్లిక్, నాన్ పబ్లిక్ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకుడు ఎం.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో ఎస్.శ్రీనివాస్, లింగస్వామి, ఉన్ని కృష్ణన్, సోమయ్య, స్వప్న, బాలనర్సింహ, ఎల్లయ్య, నూరి, మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కోట్‌పల్లి మండలానికి భారీగా నిధులు కేటాయించాం

బంట్వారం,(కోట్‌పల్లి), జూన్ 26:నూతనంగా ఏర్పడ్డ కోట్‌పల్లి మండలానికి అత్యధికంగా నిధులు కేటాయించామని జెడ్పీచైర్ పర్సన్ సునీతారెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో రూ.25లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కోట్‌పల్లి మండలాన్ని ఇంకా అభివృద్ధి చేయాలన్నారు. అభివృద్ధికి స్పీకర్ ప్రసాద్‌కుమార్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకరించాలని కోరారు. తనను జెడ్పీటీసీగా ఎన్నుకున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ ధారసింగ్, నాయకులు అంజయ్య, విజయలక్ష్మి, బందెయ్య, నర్సింగ్, సతీష్, మాల్‌రెడ్డి, రమేష్‌రాజు, శ్రీనివాస్ చర్చి పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

మండల అభివృద్ధికి కృషి

బషీరాబాద్: వెనకబడిన మండలానికి నిధులు కేటాయించానని జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. మండల చివరి సర్వసభ్య సమావేశం ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్ అధ్యతన జరుగగా చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. చైర్‌పర్సన్ ప్రసంగిస్తూ తాను చైర్ పర్సన్‌గా ఎన్నికైన తర్వాత మండలానికి రూ.కోట్లలో నిధులు మంజూరు చేశానని తెలిపారు. ఎమ్మెల్యే మట్లాడుతూ మండలానికి జూనియర్ కాలేజీని తీసుకొచ్చామన్నారు. సీఎం సహకారంతో ఈ సారి కళాశాల ప్రారంభించి అధ్యాప కులను నియమించామన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణామఫీ ఆగస్టు 15లోపు చేసేందుకు సీఎం కట్టుబడి ఉన్నారన్నారు. అంతకు ముందు పలు అంశాలపై సభ్యులు జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశాన్ని నామమాత్రంగా నిర్వహించి ముగించారు. అన ంతరం ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్, వైస్‌ఎంపీపీ జడల అన్నపూర్ణ, ఎంపీటీసీలకు చివరి సమావేశం కావడంతో జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే శాలువా, పూలమాలతో వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో నవాంద్గీ ప్యాక్స్ చైర్మన్ ఎ.వెంకట్‌రారెడ్డి, తహసీల్దార్ వై.వెంకటేష్, ఎంపీడీవో రాఘవులు, ఎంపీవో రమేష్, వివిధ శాఖల అధికారులు పలువురు పాల్గొన్నారు.

సహకార సంఘాలను తీర్చిదిద్దాలి

శామీర్‌పేట, జూన్ 26 : ఉమ్మడి జిల్లాలోని రైతు సహకార సంఘాలకు బాధ్యతగా సేవలందించేందుకు సొసైటీల చైర్మన్లు కృషిచేయాలని జిల్లా కేంద్ర సహకార సంఘం బ్యాంక్ చైర్మన్ సత్తయ్య అన్నారు. శామీర్‌పేట ప్యాక్స్ చైర్మన్, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ రామిడి మధుకర్‌రెడ్డి రైతులకు ఉత్తమ సేవలందిస్తూ రైతులు, ఇతరులు తీసుకున్న రుణాలను అత్యధిక శాతం రికవరీ చేసినందుకు 2023-24కు ఉత్తమ చైర్మన్‌గా ఎంపికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని డీసీసీబీ భవనంలో రైతులతో మహాజన సభను నిర్వహించారు. మధుకర్‌రెడ్డిని సన్మానించారు. శామీర్‌పేట రైతు సొసైటీ సీఈవో నర్సింలును, డైరెక్టర్లను, సిబ్బందిని కూడా అభినందించారు. కార్యక్రమంలో సొసైటీల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.



మధుకర్‌రెడ్డికి సేవా పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలి

వికారాబాద్. జూన్ 26: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఉన్న స్పోర్ట్స్ స్కూల్లో(హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్) నాలుగో తరగతిలో ప్రవేశాలకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో విద్యార్థుల ఎంపిక పోస్టర్‌ను కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం విడుదల చేశారు. జిల్లాలోని బాల బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోస్టర్ విడుదలలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి హనుమంతరావు, డీపీఆర్వో చెన్నమ్మ, మత్స్యశాఖ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

'పార్క్ జోలికొస్తే ఖబర్దార్'

వికారాబాద్. జూన్ 26:బీటీఎస్ కాలనీ పార్కును కాపాడాలని, దాని జోలికి వస్తే ఊరుకునేది లేదని బీటీఎస్ కాలనీ కౌన్సిలర్ అర్థ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం 33వార్డు బీటీఎస్ కాలనీలో పార్కు కబ్జాపై కాలనీ వాసులతో కలిసి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు, కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. అధికారులతో సమావేశం నిర్వహించి పార్క్ విషయంలో మాట్లాడుతానని ప్రసాద్‌కుమార్ హామీ ఇచ్చారు. మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ రమేష్, కాలనీ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం తేవాలి

● జడ్పీటీసీతో మాజీ సీఎం కేసీఆర్



శామీర్‌పేట, జూన్ 26: మండలంలో బీఆర్‌ఎస్ పార్టీకి పూర్వవైభవం తేవాలని మాజీ సీఎం కేసీఆర్ జడ్పీటీసీ అనితకు సూచించారు. బుధవారం ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆధ్వర్యంలో జడ్పీటీసీ, నాయకులు సిద్దిపేట జిల్లాలోని కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.

రేషన్ డీలర్ల భర్తీకి నోటిఫికేషన్

తాండూరు, జూన్ 26: తాండూరు నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న 18 చౌక ధరల దుకాణ డీలర్ల నోటిఫికేషన్ జారీ చేశామని ఆర్డీవో శ్రీనివాస్‌రావు బుధవారం తెలిపారు. జులై 3వ తేదీ వరకు దరఖాస్తులను ఆర్డీవో కార్యాలయంలో స్వీకరిస్తామన్నారు. పది దినాలలో సాయంత్రం 5:30గంటల వరకు అందజేయొచ్చన్నారు. బషీరాబాద్ మండలం కంసాన్‌పల్లి(బి) దుకాణానికి జనరల్ లేడీ, పెద్దేముల్ మండలం గోపాల్‌పూర్, ఆత్కూర్ గ్రామాలకు ఎస్టీ జనరల్, ఖానాపూర్‌కు జనరల్ మహిళ, తాండూరుమండలం మిట్టబాస్పల్లి దుకాణానికి బీసీ-డి మహిళ, రాంపూర్ దుకాణానికి బీసీ-ఈ మహిళ, సంగెం కలాన్ బీసీ-ఎ, తాండూరులో షాప్ నం: 4116031కు జనరల్, షాప్ నం: 4116034కు ఎస్సీ లేడీ, షాప్ నం: 4116035కు జనరల్ మహిళ, షాప్ నం:4116036కు బీసీ-బి, యాలాల మండలం ముకుందాపూర్ షాప్ ఎస్టీకి, కోకట్ జనరల్, రాఘవపూర్ ఎస్సీ, ఖానాపూర్ జనరల్, పగిడ్యాల్ దుకాణానికి బీసీ-ఎ, బాగాయిపల్లి దుకాణానికి జనరల్ లేడీ, ఇందిరమ్మ కాలనీకి బధిరులు(జనరల్)కు కేటాయించామని ఆర్డీవో వివరించారు. అభ్యర్థులు ఆయా గ్రామవాసులై, కనీసం పదో తరగతి పాసై ఉండాలన్నారు. 18 నుంచి 40ఏళ్ల మధ్య వయస్సు ఉండాలని, రాత పరీక్ష, ఇంటర్వ్యూ తేదీలను ప్రకటిస్తామని ఆర్డీవో తెలిపారు.



ఆర్డీవో శ్రీనివాస్‌రావు

2008 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

వికారాబాద్, జూన్ 26: 2008 డీఎస్సీలో క్వాలిఫైడ్ ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులకు ఉద్యోగాలిచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు బుధవారం హైదరాబాద్‌లో ప్రొఫెసర్ కోదండరాంకు ఆయన నివాసంలో వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. 2008డీఎస్సీలో ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులకు పరీక్షకు అనుమతివ్వకపోవడంతో కోర్టును ఆశ్రయించి డీఎస్సీ పరీక్ష రాశామన్నారు. సెలక్షన్ అయినా తమను విత్ హెల్డ్‌లో పెట్టారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంతోనైనా చర్చించి తమకు న్యాయం చేయించాలని కోరారు. కోదండరామ్ సానుకులంగా స్పందించారని తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.



కోదండరాంకు వినతిపత్రం ఇస్తున్న డీఎస్సీ డీఎడ్ అభ్యర్థులు

నిబంధనలు పాటించని ఏడు క్లినిక్‌లు సీజ్

శంకర్‌పల్లి, జూన్ 26: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆసుపత్రులు, క్లినిక్‌లపై జిల్లా వైద్యాధికారులు కొరడా ఝుళిపించారు. శంకర్‌పల్లిలో దాడులు చేసి ఏడు క్లినిక్‌లను సీజ్ చేశారు. జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు, ఉపవైద్యాధికారి దామోదర్‌ల బృందం శంకర్‌పల్లిలో బుధవారం సాయంత్రం తనిఖీ చేస్తుండగా విషయం తెలుసుకున్న కొందరు ఆర్‌ఎంపీ డాక్టర్లు తమ క్లినిక్‌లను బంద్ చేసుకొని వెళ్లారు. వెంకటేశ్వర, సంపత్, దివ్య, బాలాజీ క్లినిక్‌లను సీజ్ చేశారు. ప్రథమ చికిత్స చేయాల్సిన ఆర్‌ఎంపీ లు నిబంధలకు విరుద్ధంగా క్లినిక్‌లు చేర్పాటు చేసి వైద్యం చేస్తుండంతో వీటిని సీజ్ చేశారు. శ్రీనివాస సేవానికేతన్ క్లినిక్ పత్రాలు సక్రమంగా లేకపోవడంతో సీజ్ చేశారు. నాటు వైద్యం చేస్తున్న ప్రజ్వల్‌బోన్, బాలాజీ బోన్ సెట్టింగ్స్ సెంటర్లను సీజ్ చేశారు. స్వరాజ్ ఆసుపత్రిలో లేబర్ గది, ఆపరేషన్ థియేటర్‌లో నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వైద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాతీయ మెడికల్ కౌన్సిల్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌ల ఆదేశాల మేరకు ఆసుపత్రులను తనిఖీ చేయడం జరుగుతున్నదన్నారు. జిల్లావ్యాప్తంగా నిర్వహణ సక్రమంగా లేని 13 ఆసుపత్రుకు అపరాధ రుసుం వేయడం జరిగిందని వివరించారు. ఆర్ ఎంపీలు డాక్టర్లు కాదని, వారు డాక్టర్లుగా బోర్డులు పెట్టుకోవద్దని హెచ్చరించారు. ప్రథమ చికత్స మాత్రమే చేయాలని, అర్హతకు మించిన వైద్యం చేయకూడదన్నారు. గోకుల్ ఆసుపత్రి డాక్టర్ కుమార్, లలిత క్లినిక్ డాక్టర్లు లింగారెడ్డి, నవీనలకు సరైనపత్రాలు లేనందున నోటీసులందజేశారు. సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, డాక్టర్లు ఉన్నారు.





స్వరాజ్ క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో, శ్రీ బాలాజీ క్లినిక్‌ను సీజ్ చేసిన అధికారులు

నేడు కుర్మిద్దలో మహారాష్ట్ర ప్రభుత్వ ప్లానింగ్ కమిటీ మాజీ సభ్యుడి పర్యటన

యాచారం, జూన్ 26 : ఫార్మాసిటీ భూ బాధిత గ్రామమైన కుర్మిద్దలో గురువారం మహారాష్ట్ర ప్రభుత్వ ప్లానింగ్ కమిటీ మాజీ సభ్యుడు హెచ్‌ఎం. దేశ్‌రథ, సామాజికవేత్త కవుల సరస్వతీలు పర్యటించనున్నారు. ఈమేరకు వారు ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులు నేడు ఏం చేసి జీవనం సాగిస్తున్నారు? భూములు తీసుకున్న ప్రభుత్వం పూర్తి స్థాయిలో పరిహారం అందించిందా? భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి సాయమందిస్తే బాగుంటుంది. భూములు పూర్తిగా కోల్పోయిన రైతులకు తిరిగి భూములు పంచాలా? వద్దా? గతంలో తీసుకున్న పరిహారం సరిపోయిందా? ఇంకా అందించాలా? తదితర అంశాలను వారు రైతులతో సమావేశమై తెలుసుకుంటారని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. మెగాటౌన్ షిప్ ఏర్పాటు చేస్తే యువతకు ఉపాధి కలుగుతుందని నమ్మకం ఉందా? అని వారు రైతులను అడిగి తెలుసుకోనున్నారని కమిటీ తెలిపింది. రైతులతో మాట్లాడిన అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడించనున్నారని తెలిపింది.

నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపవద్దు

చేవెళ్ల, జూన్ 26 : నంబర్లు ప్లేట్ లేకుండా రోడ్లపై వాహనాలు నడిపిస్తే కేసులు నమోదు చేస్తామని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. బుధవారం సాయంత్రం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ప్రధాన చౌరస్తాల వద్ద ట్రాఫిక్ పోలీస్‌ల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా భారీగా తనిఖీ నిర్వహించారు. నెంబర్ ప్లేట్‌లు లేని 12 వాహనాలను సీజ్ చేశారు. చేవెళ్ల ట్రాఫిక్ ఎస్సై విఠల్‌రెడ్డి, కానిస్టేబుళ్లు ఉన్నారు.



వాహనాలుల తనిఖీ చేస్తున్న పోలీస్‌లు

అధిక సాంద్రత పద్ధతితో ఎక్కువ దిగుబడి

ఆమనగల్లు, జూన్ 26: పత్తి సాగులో రైతులు అధిక సాంద్రత పద్ధతి పాటించి దిగుబడులు పెంచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ సూచించారు. పంటల సాగులో రైతులు మారుతున్న కాలానికనుగుణంగా శాస్త్రీయ పద్ధతులు, మెళకువలు పాటించాలని కోరారు. ఆమనగల్లు మండలం కోనాపూర్‌లో బుధవారం వ్యవసాయ శాఖ, రంగారెడ్డి జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో పత్తి పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో అరుణకుమారి అధ్యక్షతన నిర్వహించిన సదస్సు కు శాస్త్రవేత్తలు డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ సుధీర్, ఏడీఏ ఆదిలక్ష్మీలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పత్తిలో అధిక సాంద్రత పద్ధతి, భూసార పరీక్ష, చీడ పీడల నివారణ, దిగుబడుల పెంపుపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పత్తిసాగులో రైతులు మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. పంటల సాగులో రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ఏడీఏ ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఆదునిక సేద్యం రైతులకు శ్రేయోదాయకమన్నారు. సాగులో రైతులు పెట్టుబడులు తగ్గించుకొని దిగుబడులు పెంచుకోవాలని సూచించారు. చీడ పీడల నివారణలో ఎప్పటికప్పుడు తగిన జాగ్రతలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈవో లు మీనాక్షి, రాణి, శివతేజ, సాయిరామ్, విత్తన కంపెనీల డీలర్లు సూర్యప్రకాశ్, కళ్యాణ్, కిరణ్‌కుమార్ రెడ్డి, కేవి. రంగారెడ్డి, దిలీప్, హరికా, సునీల్, రైతులున్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డా.విజయ్‌కుమార్

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడిని కలిసిన మేడ్చల్ బీజేపీ నేతలు


మంత్రితో బీజేపీ నాయకులు

మేడ్చల్ టౌన్, జూన్ 26 : కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు బుధవారం ఢిల్లీల్లో మర్యాదపూరకంగా కలిశారు. లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకారానికి ఎంపీ ఈటల రాజేందర్‌తో ఢిల్లీ వెళ్లిన నాయకులు కేంద్ర మంత్రులు బండి సంజయ్, ఇతర మంత్రులను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మంత్రులను కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గం సభ్యుడు, ఘట్‌కేసేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, గుండ్లపోచంపల్లి కౌన్సిలర్ మల్లికార్జున్, వెంకటేష్, కిరణ్‌రెడ్డి ఉన్నారు.

జితేందర్‌రెడ్డిని కలిసిన జయరాంరెడ్డి



కీసర, జూన్26: తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎన్‌టీయూసీ మాజీ అధ్యక్షుడు ఐలేని జయరాంరెడ్డి బుధవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కోరకు యూనియన్ తరఫున కలిసికట్టుగా పనిచేయాలని జితేందర్‌రెడ్డి సూచించినట్టు జయరాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యుడు ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

సాహూ మహరాజ్ ఆశయ సాధనకు కృషి చేయాలి


సాహూ మహరాజ్ చిత్రపటానికి నాయకుల నివాళులు

పరిగి,జూన్ 26: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రిజర్వేషన్ల పితామహుడు చత్రపతి సాహూమహరాజ్ 150 జయంతిని బుధవారం పరిగిలోని పాలకేంద్రంలో జరుపుకున్నారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత్ ముక్తిమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింద్‌నాయక్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు సాహూ మహరాజ్ అన్నారు. అశయ సాధన కోసం కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో బీఎంపీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య, జేఏసీ జిల్లా కన్వీనర్ ఎం.నాగేశ్వర్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి రవీందర్‌నాయక్, వివిధ సంఘాల నాయకులు బుస చంద్రయ్య, వెంకట్, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు కఠిన చర్యలు

పరిగి,జూన్ 26: నాటుసారాను సంపూర్ణంగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్, పరిగి సీఐ నీరజారెడ్డి అన్నారు. ఆపరేషన్ గుడంబాలో భాగంగా బుధవారం పరిగి పరిధిలోని కొత్తపల్లితండా, ముస్లిపల్లితండాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఆగస్టు 31 నాటికి సంపూర్ణంగా సారా నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గుడుంబా తయారీదారులు, వారికి బెల్లం అమ్మే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఒకే వ్యక్తి రెండో సారి పట్టుబడితే లక్ష రూపాయల జరిమానాతోపాటు, పీడీ యాక్టు అమలుచేసేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ దయాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర రూరల్, జూన్ 26 : మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి జలమండలి అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మంచినీటి సమస్యపై హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నల్లా కనెక్షన్ ఇచ్చే సమయంలో సీసీ రోడ్లు పగలగొట్టకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్, జలమండలి డీజీఎం నాగరాజు, డీఈఈ సుదర్శనం రఘు, మేనేజర్ చంద్రశేఖర్, హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ సతీష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, వాటర్‌మెన్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మేక మృత్యువాత

తాండూరు రూరల్, జూన్ 26 : విద్యుత్ షాక్ తగిలి ఓ మేక మృత్యువాత పడింది. ఈ సంఘటన తాండూరు మండలం అంతారం తండాలో జరిగింది. బాధితుల తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన మోతీబాయి కుటుంబీలు మేకలను మేపేందుకు పొలం వైపు తీసుకెళతారు. బుధవారం ఆమె తన మేకలను తండా సమీపంలోని బైపాస్ రోడ్డు మార్గం వైపు తీసుకెళ్లింది. అక్కడ ఉన్న ఓ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లిన ఓ మేక విద్యుత్ షాక్‌కు గురై పడిపోయింది. దగ్గరకు వెళ్లి చూడగా మేక మృతిచెందినట్లు గుర్తించారు. మోతీబాయి కన్నీరుమున్నీరైంది.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం


వికారాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

వికారాబాద్/ఘట్‌కేసర్/పరిగి/ఘట్‌కేసర్ రూరల్/తాండూరు, జూన్ 26 : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఎమ్మార్పీ పెట్రోల్ బంక్ వరకు విద్యార్థులతో 'సే నో టు డ్రగ్స్' ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని అదనపు ఎస్పీ, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. మాదక ద్రవ్యాలతో జరిగే నష్టాలను ప్రజలకు వివరించారు. ర్యాలీతో సరిపెట్టకుండా మాదక ద్రవ్యాల నిర్మూలనకు నడుం బిగించాలని కోరారు. యువత క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వికారాబాద్ డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, సీఐలు నాగరాజు, రామకృష్ణ, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు అన్నారు. ఘట్‌కేసర్‌లో యంనంపేట్ చౌరస్తా నుంచి శివారెడ్డిగూడ వరకు కొండాపూర్ విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల కోఆర్డినేటర్ శ్రీలత, కోటేశ్వర్‌రావు, ఎస్సైలు, విద్యార్థినులు పాల్గొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి మాదక ద్రవ్యాల నిర్మూలన జరగాల్సిందే అని పరిగి సీఐ ఎన్.శ్రీనివాస్ అన్నారు. పరిగిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. డ్రగ్స్ రహిత సమాజస్థాపనకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ ఎస్ఐ శివకృష్ణ అన్నారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చి మాట్లాడారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగేశ్వర్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అఫీసర్ మల్లేష్, విద్యార్థులు పాల్గొన్నారు. యువత డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని తాండూరు డీఎస్పీ బలాకృష్ణారెడ్డి అన్నారు. సబ్‌డివిజన్ పరిధిలో యాంటీ డ్రగ్స్ డే నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తపదార్థాలకు బానిసలైతే జీవితాలు, కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. కార్యక్రమంలో పట్టణ సిఐ సంతోష్‌కుమార్, రూరల్ అశోక్ కుమార్, ఎస్ఐలు , పోలీస్‌శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


తాండూరలో ప్రసంగిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి


ఘట్‌కేసర్‌లో యంనంపేట్ చౌరస్తా వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



మహిళలకు కుట్టు మిషన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

శామీర్‌పేట, జూన్ 26: ప్రభుత్వం అనేక సంస్థల ద్వారా కల్పిస్తున్న వృత్తి నైపుణ్యాన్ని మహిళలు బాధ్యతగా నేర్చుకొని స్వయం ఉపాధితో అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. లాల్‌గడి మలక్‌పేటలో అభయ ఫౌండేషన్ ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు నాలుగు నెలలుగా కుట్టుశిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. కుట్టు శిక్షణ నేర్చుకున్న మహిళలకు బుధవారం కుట్టు మిషన్లను ఎమ్మెల్యే మల్లారెడ్డి పంపిణీ చేశారు. మహిళలు కష్టపడి, వృత్తి శిక్షణ పొంది వ్యాపారాలను చేసి ప్రగతిని సాధించాలని కోరారు. తానుకూడ చిన్న నాటి నుంచి పూలు, పాలు, వ్యాపారాలు చేసి కింది స్థాయి నుంచి ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చానన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, జడ్పీటీసీ అనిత, ఎంపీపీ ఎ ల్లూబాయి, మాజీ సర్పంచ్‌లు వనజశ్రీనివాస్‌రెడ్డి, గుర్క కుమార్, బీఆర్ఎస్ నాయకులు, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

లాల్‌గడి మలక్‌పేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎల్లం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. లాల్‌గడిలోని మృతుడు ఎల్లం ఇంటికి ఎమ్మెల్యే మల్లారెడ్డి వెళ్లి బాధిత కుటుంబీకులను ఓదార్చారు. తాను అన్ని విధాలా సహాయసహకారాన్ని అందించి ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. బాధితులకు ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆర్థిక సాయాన్ని అందచేశారు.

మహిళపై లైంగికదాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి



మాట్లాడుతున్న కేఎన్‌పీఎస్ నాయకులు

కొడంగల్, జూన్ 26: నాగర్‌కర్నూల్ జిల్లాలో చెంచు మహిళపై లైంగికదాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని కేఎన్‌పీఎస్ మండల అధ్యక్షుడు అంజి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లిలో జరిగిన ఈ ఘటన బాధాకరం అన్నారు. గ్రామానికి చెందిన గిరిజన మహిళకు నాలుగెకరాల భూమి ఉండగా ఆర్థిక ఇబ్బందులతో అదే గ్రామానికి చెందిన బండి వెంకటేశ్‌యాదవ్‌కు కౌలుకు ఇచ్చారని తెలిపారు. కౌలు దారుడు వారికి పొలంలో పనిచేస్తే భార్యాభర్తలకు రోజుకు రెండు వందల చొప్పున ఇస్తూ జీతం కుదుర్చుకున్నారని తెలిపారు. రెండు వందల రూపాయలు చాలవని వెంకటేశ్‌ను మహిళ కోరగా ఆమెపై దుర్భాషలాడుతూ రహస్య ప్రాంతంలో బంధించి చిత్రహింసలు పెట్టి లైంగిక దాడి చేయడం హేయం అన్నారు. దీనికి పాల్పడిన నిందితులకు ఉరి శిక్ష విధించి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ నాయకులు మహేశ్, ఆనంద్, పకీరప్ప, నర్సిములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన జీహెచ్‌ఎంలకు సన్మానం


జీహెచ్‌ఎంలను సన్మానిస్తున్న టీచర్లు, నాయకులు

బొంరాస్‌పేట్, జూన్ 26: బదిలీపై వచ్చి పాఠశాలల్లో జీహెచ్‌ఎంలుగా బాధ్యతలు స్వీకరించిన వారిని ఉపాధ్యాయ జేఏసీ, ఎమ్మార్పీ ఆధ్వర్యంలో సన్మానించారు. బుధవారం దుద్యాల, చౌదర్‌పల్లి, హకీంపేట్, కుదురుమళ్ల పాఠశాలల్లో జీహెచ్‌ఎంలు విజయరామారావు, రవీందర్‌గౌడ్, నరేందర్, ప్రతాప్‌రెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో రాంరెడ్డి, నోడల్ అధికారి హరిలాల్, ఎంపీడీవో, జేఏసీ నాయకులు జి.గోపాల్, అనిల్‌కుమార్, రవీందర్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, మేరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన హెచ్‌ఎంకు సన్మానం


కరన్‌కోట్‌లో హెచ్‌ఎం నర్సిరెడ్డిని సన్మానిస్తున్న టీచర్లు

తాండూరు రూరల్, జూన్ 26 : కరన్‌కోట్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో కొన్నేళ్ల పాటు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన నర్సిరెడ్డి చిట్టిఘనాపూర్ పాఠశాలకు బదిలీ అయ్యారు. ఆయనను ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు. నర్సిరెడ్డి కొన్నేళ్లుగా గొప్పగా విద్యార్థులకు సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, శివకుమార్, రాంచందర్ పాల్గొన్నారు. అలాగే మల్కాపూర్ పాఠశాలలో పనిచేస్తున్న నాగప్ప, జినుగుర్తి పాఠశాల హెచ్‌ఎంగా బదిలీ అయ్యారు. ఆయన బాధ్యతలు చేపట్టగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు.

మట్టి తవ్వకాలకు బ్రేక్!

● విచారణకు రాని అధికారులు

తాండూరు రూరల్, జూన్ 26: రాంపూర్ సమీపంలో మట్టి(మొరం) తవ్వకాలకు తాత్కాలిక బ్రేక్ పడింది. కొంతకాలంగా అనుమతులు లేకుండా మట్టిని నేషనల్ హైవే పనులకు తరలించారు. మంగళవారం అక్రమ మట్టి తవ్వకాలపై వెలుగులోకి వచ్చింది. ఎకర పొలంలో యంత్రాలతో రోజూ వందలాది టిప్పర్లతో మట్టి తరలిస్తున్నారు. ఈ విషయం ఆర్డీవో శ్రీనివాస్‌రావు దృష్టికి వెళ్లింది. పెద్దఎత్తున మట్టి తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. మట్టి తవ్వేయడంతో పెద్దగుంత ఏర్పడింది. ఓవర్‌లోడ్‌తో రోడ్లన్నీ ధ్వంసమైతున్నాయని పేర్కొన్నారు. కాగా పొలం అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలపై పొలం యజమానిపై కేసు నమోదు చేస్తామని తహసీల్దార్ తారాసింగ్ పేర్కొన్నారు. వ్యవసాయేతర భూమిగా మార్చుకొని మైనింగ్ నుంచి అనుమతి పొంది రాయల్టీ కట్టిన తర్వాతే మట్టి తవ్వాలని అన్నారు. గురువారం మైనింగ్ అధికారులతో కలిసి రాంపూర్ వెళ్లి పొలంయజమానిపై కేసు నమోదుతో పాటు జరిమానా విధిస్తామని ఆయన పేర్కొన్నారు.

కమిషనర్‌ను కలిసిన నాయకులు

మేడ్చల్ జూన్ 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ నూతన కమిషనర్‌గా నియమితులైన జ్యోతి బుద్ధ ప్రకాష్(ఐఏఎస్)ను తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు, సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషనర్ సర్వే డిపార్ట్‌మెంట్‌లోని సమస్య లు అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించారని నాయకులు వెల్లడించారు. అలాగే, ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని హర్షం వ్యక్తం చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నరహరిరావు, ప్రధానకార్యదర్శి ఎం.రాంచందర్, కోశాధికారి వి.శ్రీరాం, ఆర్.కేశవులు, ఎం.నాగేందర్, ఇనేష్ ఉన్నారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు ఈ కమిషనర్ ద్వారా అయినా పరిష్కారమౌతాయన్న ఆశాభావాన్ని సంఘ నాయకులు వ్యక్తం చేశారు.

విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ

దోమ, జూన్ 26: దోమలోని అంబేడ్కర్‌నగర్ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ నోటుబుక్‌లు పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి తన వంతుగా సహకారం అందజేస్తున్నానని తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో చదువుతూ తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేశ్, దోమ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, వెంకటేశ్, అంగన్‌వాడీ టీచర్ నిర్మల, గ్రామస్థులు రమేశ్, లింగయ్య, వెంకటయ్య, పాఠశాల ఎస్ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేజీబీవీకి కుర్చీలు అందజేత

కులకచర్ల, జూన్ 26: కులకచర్లలోని కస్తూర్బాగాంధీ పాఠశాలకు నియోజకవర్గ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం కుర్చీలు అందించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ విశ్వదేవి, పీఎన్ పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. బాలికల సౌకర్యార్థం తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ కానీ ఇంకేదైనా ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయులు, స్థానికులు రాజశేఖర్, నర్సిములు, కృష్ణ, సత్తయ్య, మొగులయ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'కులగణన చేయాల్సిందే'

తాండూరు, జూన్ 26: బీసీ కులగణన చేసి వారికి వచ్చే రాజ్యాధికార వాటను ఇవ్వాలని దొరిశెట్టి సత్యమూర్తి, నరేందర్, జగన్, బాలకృష్ణ, సాయి డిమాండ్ చేశారు. బుధవారం తాండూరులో సాహూ మహరాజ్ జయంతిని నిర్వహించారు. అణిచివేతకు గురైన జాతుల అభివృద్ధికి సాహు మహరాజ్ కృషిచేశారని, ఆయన వల్లే రిజర్వేషన్లు వచ్చాయని వారు అన్నారు.

పేద ప్రజలకు అండగా సీఎం సహాయ నిధి

బొంరాస్‌పేట్, జూన్ 26:పేదలకు సీఎం సహాయ నిధి అండగా ఉందని కాంగ్రెస్ కొడంగల్‌నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం బొంరాస్‌పేట్ మండలం దుద్యాలకు చెందిన టి.అంజయ్యకు హైదరాబాద్‌లో రూ.1లక్ష 20వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయనకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించడం జరిగింది. వైద్యం చేయించుకోలేని పేదలకు సీఎంఆర్‌ఎఫ్ మేలు చేస్తుందన్నారు.

ప్రభుత్వ భూమి అక్రమిస్తే చర్యలు

కీసర, జూన్ 26: ప్రభుత్వ భూమి అక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ అశోక్ అన్నారు. అంకిరెడ్డిపల్లి వాసుల ఫిర్యాదు మేరకు సర్వే నంబర్ 886, 887, 888, 918లలోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన ప్రహరీని బుధవారం కూల్చివేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

గొర్రెల కాపరుల నూతన సంఘం ఎన్నిక

కులకచర్ల, జూన్ 26: కులకచర్ల మండలంలోని ఘనపూర్‌లో మల్లికార్జున గొర్రె కాపరుల నూతన సంఘం కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వార్ల శివలింగం, ప్రధాన కార్యదర్శిగా రామచంద్రయ్య ఎన్నికయ్యారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం


మృతిచెందిన దశరథ్

బషీరాబాద్, జూన్ 26 : వికారాబాద్ జిల్లాలో రెండు వేర్వేరు చోట్ల బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఈ దుర్ఘటనలపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బషీరాబాద్ మండలం రెడ్డిఘణాపూర్ సమీపంలో రెడ్డిఘణాపూర్ రేషన్ డీలర్ మహబూబ్‌సాబ్, దండేటి దశరథ్ బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్, బైక్ ఢీకొన్నాయి. బైక్ వెనక కూర్చున్న దశరథ్(40) అక్కడికక్కడే మృతిచెందగా, మహబూబ్‌సాబ్‌కు తీవ్ర గాయలయ్యాయి. అతడిని కుటుంబీకులు తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌కుమార్ తెలిపారు.

కల్లు తాగిన మత్తులో విద్యుత్ స్తంభానికి ఢీకొని యువకుడు ...


మృతిచెందిన మల్లేశ్

కులకచర్ల:మండలంలోని ఇప్పయిపల్లి గేటు సమీపంలో బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొని యువకుడు మృతిచెందాడు. మృతుడు పాలమూరు జిల్లా నవాబుపేట మండలం కిషన్‌గూడ గ్రామానికిచెందిన ద్యాగా మల్లేశ్(24)గా గుర్తించారు. మల్లేశ్ మంగళవారం రాత్రి స్నేహితులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకున్నాడు. బుధవారం స్నేహితులు పార్టీ ఇవ్వాలని కోరారు. స్నేహితులు ఎంబటి శ్రీకాంత్, యార అనిల్, కుమ్మరి కృష్ణ, మల్లేశ్ రెండు బైక్‌లపై ఇప్పయిపల్లి గేటు సమీపంలో తాటి కల్లు తాగారు. నువ్వు మత్తులో ఉన్నావు బైక్ నడపొద్దని మల్లేశ్‌ను స్నేహితులు కోరారు. మల్లేశ్ వినలేదు. అతడి బైక్ వెనక కూర్చున్న కృష్ణ భయపడి బైక్‌పై కూర్చోలేదు. ఒకే బైక్‌పై మిగతా ముగ్గురు వెళ్లగా మల్లేశ్ ఒక్కడే బైక్‌పై వేగంగా వెళ్లి కొద్ది దూరంలోనే రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభానిన్ని ఢీకొన్నాడు. తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. జన్మదినం జరుపుకున్న మరుసటి రోజే మృత్యువాత పడటంతో స్నేహితులు కన్నీరు పెట్టారు. మల్లేశ్‌కు భార్య పుష్ప, కూతురు(1) ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో ఉరి వేసుకొని ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న శివశంకర్

మేడ్చల్ టౌన్, జూన్ 26: భార్యాభర్తల గొడవతో మనస్తాపానికి గురైన భర్త ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడ్చల్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఘనాపూర్‌నకు చెందిన గుమ్మడిదల శివశంకర్‌కు పదేళ్ల క్రితం సింగాయిపల్లికి చెందిన లతతో వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. నాలుగేళ్ల క్రితం లత తన భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లింది. దీంతో శివశంకర్ పెద్దలతో భార్యను తిరిగి ఇంటికి రప్పించుకునే ప్రయత్నం చేసినా భార్య వినలేదు. మంగళవారం మృతుడు కొంత మంది పెద్దలతో కలిసి భార్యను తీసుకు వచ్చేందుకు వెళ్లగా ఆమె రాలేదు. అతడిని పిల్లలను సైతం కలవనీయ లేదు. మనస్తాపం చెందిన శివశంకర్‌కు మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. అతడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తహసీల్దార్ పేరుతో డబ్బు వసూలు.. వ్యక్తిపై కేసు


మహేందర్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, జూన్ 26: తహసీల్దార్ పేరు చెప్పి రూ.2లక్షల వసూలు చేసిన మోసగాడిపై పోలీసులు కేసు నమోదుచేశారు. మండలంలోని సోమారం పరిధి గంగాస్థాన్ వెంచర్ నిర్వాహకుల వద్ద నుంచి పూడూరుకు చెందిన మహేందర్‌రెడ్డి తాను తహసీల్దార్ కార్యలయం నుంచి వచ్చానని, తహసీల్దార్ పంపినట్టు నమ్మించి వెంచర్ యజమానుల నుంచి రూ.రెండు లక్షలు వసులు చేశాడు. మమేందర్‌రెడ్డిపై అనుమానంతో వెంచర్ నిర్వాహకులు చెక్కు ఇచ్చారు. వసూళ్లకు అలవాటు పడ్డ మహేందర్‌రెడ్డి వెంచర్ వారితో మాట్లాడి వెంచర్ స్థలం వివాదంలో ఉందని, దాన్ని పరిష్కరించేందుకు కలెక్టర్ స్థాయి వరకు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందన్నాడు. అందుకు రూ.3కోట్లు ఇవ్వాలని బెదిరించాడు. దీంతో వెంచర్ నిర్వాహకులు అంత డబ్బులు ఇవ్వలేమని, కోటిన్నర ఇవ్వగలమంటూ నమ్మించి నేరుగా మేడ్చల్ తహసీల్దార్ శైలజను కలిసి మహేందర్‌రెడ్డి గురించి వివరించారు. దీంతో తన పేరుతో బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నాడంటూ, మహేందర్‌రెడ్డిపై తహసీల్దార్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

టైర్ పగిలి ఇసుక లారీ బోల్తా


వంతెనపై నుంచి పల్టీకొట్టిన ఇసుక లారీ

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 26: టైరు పగిలి ఇసుక లారీ పల్టీకొట్టిన ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలైన సంఘటన మండలంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపినవివరాల ప్రకారం.. ఏటూరునాగారం నుంచి ఇసుక లోడు లారీ(టీఎస్ 30టీఏ 2024) హైదరాబాద్‌కు వస్తోంది. ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డు అండర్‌పాస్ వద్దకు రాగానే టైర్ పగిలింది. లారీ వంతెనపై నుంచి పల్టీకొట్టి కిందపడగానే మంటలు లేచాయి. డ్రైవర్ వెంకట్‌రెడ్డి(43)కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఫైరింజన్‌కు సమాచారమివ్వగా ఫైరింజనొచ్చి మంటలార్పింది. లారీ క్యాబిన్ దగ్ధమైంది. డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం.. కేసు నమోదు


విద్యార్థి సిద్ధార్థ

కులకచర్ల, జూన్ 26 : కులకచర్ల మండలం బొంరెడ్డిపల్లికి చెందిన విద్యార్థి సిద్ధార్థ(16) అదృశ్యమయ్యాడు. దండు శ్యామలమ్మ కుమారుడు సిద్ధార్థ చిన్న అంతారంలో పిన్ని పద్మమ్మ వద్ద ఉంటూ పుట్టపహాడ్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. వారం రోజులుగా బడికి వెళ్లడం లేదు. బడికి వెళ్లకుంటే మీ గ్రామం బొంరెడ్డిపల్లిలోని మీ అమ్మ దగ్గరికి వెళ్లాలని పిన్ని పద్మమ్మ అంది. దీంతో మంగళవారం చిన్న అంతారం నుంచి సిద్ధార్థ సైకిల్‌పై బయలుదేరాడు. కలత చెందిన తల్లి, పిన్ని సిద్ధార్థ ఆచూకీ కోసం వెతికారు. ఆచూకీ లభించకపోడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బషీరాబాద్, జూన్ 26: మండలంలోని మైల్వార్ శివారులో ఇసుకను ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తుండగా బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి పట్టుబడిన శ్యామప్పపై కేసు నమోదు చేశారు. కోర్టుకు అప్పగించినట్లు ఎస్ఐ రమేష్‌కుమార్ తెలిపారు.

సంక్షిప్తంగా..

● **తాండూరు:** తాండూరు డిపో పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి గురువారం సాయంత్రం 4 -5గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తామని డిపో మేనేజర్ సమత బుధవారం తెలిపారు. ప్రయాణంలో సమస్యలపై, సలహాలుకు 9959226251నంబర్‌కు డయల్ చేయాలని కోరారు.

● **మోమిన్‌పేట్/కొడంగల్ రూరల్:** మోమిన్‌పేట్ మండలంలోని కొత్త కోల్కుందలో గచ్చిబౌలి హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ ఆసుపత్రి వైద్యులు ఐదు రోజుల పాటు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. పంచాయతీ కార్యాలయంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యులు వినోద్, సాయి సుధీర్, ప్రవళిక, సాయి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు.

● **ధారూరు:** కేరెల్లిలోని సత్యసాయి గ్రామీణ సార్వజనిక కేంద్రంలో ఈ నెల 28న క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎంఎన్‌జే క్యాన్సర్ అసుపత్రి వైద్యులతో ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు చేసి చికిత్స అందించనున్నట్లు వారు చెప్పారు.

● **తాండూరు:** విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలను పొందాలని తాండూరు సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్ నరేందర్ అన్నారు. తాండూరులోని పీపుల్స్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్లేస్‌మెంట్ సెల్, కేరీర్ కౌన్సిలింగ్ ట్రైనింగ్ కేంద్రాన్ని ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించారు. డిగ్రీలో చేరే విద్యార్థుల కోసం పీపుల్స్ కాలేజీలో ప్లేస్‌మెంట్ సెల్, కేరీర్ కౌన్సిలింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపల్ సత్యానంద్, చంద్రకళ, నాగేశ్వర్‌చారి, రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** బషీరాబాద్ పంచాయతీ తైబజార్(వారంతపు కూరగాయాల సంత)కు వేలం నిర్వహించారు. ఎంపీడీవో రాఘవులు, ఎంపీవో రమేష్ సమక్షంలో పాట కార్యక్రమం చేపట్టారు. రెడ్డి ఘణాపూర్‌నకు చెందిన మహబూబ్ రూ.4.12లక్షలకు వేలాన్ని దక్కించుకున్నారు. వచ్చే మార్చి31 వరకు వేలం పొందిన వ్యక్తి సంతలో కూరగాయలు, రవాణా వాహనాల నుంచి నిర్ధీత తై బజారు రుసుంను వసూలు చేసుకోవాల్సి ఉంటుందని కార్యదర్శి జయకార్ తెలిపారు.

● **తాండూరు రూరల్:** తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని కొత్లాపూర్ రేణుక ఎల్లమ్మ ఆలయ హుండీని ఎండోమెంట్ ఈవో రాజేందర్‌రెడ్డి పర్యవేక్షణ ఆధ్వర్యంలో లెక్కించారు. గతనెల 22న నుంచి ఈ నెల 23వ తేదీ వరకు జాతర ఉత్సవాల్లో భక్తులు హుండీలో వేసిన నగదు, కానుకలను గ్రామస్తుల సమక్షంలో లెక్కించారు. రూ.5 లక్షల 22వేల 894ల నగదు, వెండి కానుకలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవో శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ సాయిలు, నవీన్‌రెడ్డి, శంషొద్దీన్, వెంకయ్యగౌడ్, మొగులప్ప, రాజు, పూజారి శ్రీనివాస్ ఉన్నారు.

● **దోమ:** దిర్సంపల్లిలో నిర్వహించిన తైబజార్ వేలంలో రూ.53వేలకు మల్లెపల్లి సతీశ్‌కుమార్ దక్కించుకున్నారు. సతీశ్‌కుమార్ మాట్లాడుతూ మార్కెట్ నిర్వాహణకు తనవంతుగా కృషిచేస్తానన్నారు. తనకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్, ఎంపీటీసీ నవాజ్‌రెడ్డి, మాజీ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు నారాయణగౌడ్, రాములుగౌడ్, రఫూఫ్, అఖిల్ పాల్గొన్నారు.

● **పూడూరు:** మండల పరిధి మన్నెగూడ తైబజార్‌కు పంచాయతీ కార్యాలయంలో మాణిక్యం అధ్యక్షతన వేలంపాట నిర్వహించారు. ఆరుగురు రూ.10వేల రూపాయలు పంచాయతీకి డిపాజిట్ చేశారు. రియాజ్ అనే వ్యక్తి రూ.48వేలకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఎంపీడీవో పాండు, స్పెషల్ ఆఫీసర్ తులసిరాం, ఎంపీవో సుందర్, తదితరులు పాల్గొన్నారు.

● **కీసర:** త్వరలో రైతులకు భూ ఆరోగ్య కార్డులు అందజేస్తామని ఏవో మాధవీలత అన్నారు. యాద్గార్‌పల్లిలో వ్యవసాయ శాఖ అధ్వర్యంలో రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలను సేకరించారు. ఏవో మాట్లాడుతూ పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. మట్టి నమూన పరీక్షలు నిర్వహించిన అనంతరం రైతులకు భూ ఆరోగ్య కార్డులు అందజేస్తామన్నారు. మండలంలో 2,736 భూసార పరీక్షలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆసియా భేగం, వ్యవసాయ విస్తరణ అధికారి వందన లతో పాటు రైతులు పాల్గొన్నారు.

● **కీసర:** ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. భోగారానికి చెందిన రైతు మామిడి మధుసూదన్‌రెడ్డి మరణించాడు. ఆయన కుటుంబానికి రైతుబీమా కింద 5లక్షల రూపాయాల చెక్కును సుధీర్‌రెడ్డి తన నివాసంలో అందజేశారు.

● **తాండూరు:** మీరు తీసుకునే ప్రతీ నిర్ణయం మీ భవిష్యత్తును నిర్ణయిస్తుందని సీఎస్‌బీఐఎఎస్ అకాడమి ప్రముఖురాలు ఎం.బాలలత అన్నారు. బుయ్యని సరళాశ్రీనివాస్‌రెడ్డి ఏర్పాటు చేసిన విద్యార్థి విద్యార్థులకు చదువు, ఉద్యోగాలపై మోటివేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిరుద్యోగులకు గైడెన్స్ ఇవ్వాలన్నారు.

అనారోగ్యంతో పీఏసీఎస్ మాజీ చైర్మన్ మృతి



నవాబుపేట, జూన్ 26: నవాబుపేట మండలం అక్నాపూర్‌నకు చెందిన పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందారు. మంగళవారం రాత్రి తుది శ్వాస విడిచారు. గతంలో చించల్‌పేట పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్‌గా పనిచేశారు. కాంగ్రెస్, టీడీపీ పార్టీల్లో పనిచేస్తూ పేరును సంపాదించారు. ఆయన మృతిపట్ల మాజీ సర్పంచ్‌లు గోపాల్, అజయ్‌కుమార్, అమరేందర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మైనారిటీ నాయకులు రజాక్, ఎంపీటీసీలు సంతాపం తెలిపారు.